ప్రభాత
ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 108 | పేజీలు: 5 | వెల: రూ.3/- | మంగళవారం 28 జులై 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# కాంగ్రెస్ వ్యవహారాలపై ఏఐసీసీ సమీక్ష

### హాజరైన సీఎం రేవంత్, పీసీసీ చీఫ్, మీనాక్షి నటరాజన్.... పార్టీ బలోపేతం, నిర్మాణం తదితర అంశాలపై చర్చ..

### తెలంగాణలో చేపడుతున్న కార్యక్రమాలను అధిష్టానానికి వివరించిన టిపిసిసి

**న్యూఢిల్లీ, జులై 27 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ అధిష్ఠానం నిర్దేశించిన ఆరు పాయింట్ల ఫార్ములాపై తెలంగాణకు చెందిన నాయకులతో ఏఐసీసీ చర్చించింది. ఈ మే-రకు ఏఐసీసీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్‌లు సమావేశం అయ్యారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, పార్టీ-ప్రభుత్వం మధ్య సమన్వయం, ఎస్ఐఆర్ అమలు తీరు వంటి కీలక అంశాలపై ఢిల్లీలో సమీక్ష నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ సంస్థాగత నిర్మాణం, పార్టీ కార్యక్రమాలు, పార్టీ బలోపేతం, పార్టీ-ప్రభుత్వం మధ్య సమన్వయం, ఎస్ఐఆర్ అమలు తీరు, క్షేత్రస్థాయి పార్టీ కార్యకలాపాలపై రాష్ట్ర నాయకత్వం అధిష్ఠానానికి వివరించింది. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జాతీయ స్థాయి నుంచి పోలింగ్ బూత్ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసేందుకు చేపడుతున్న చర్యలను కేసీ వేణుగోపాల్‌కు తెలిపారు. పార్టీ బాధ్యతల అప్పగింత, శిక్షణ కార్యక్రమాలు, సంస్థాగత క్రమశిక్షణ, సమావేశాల నిర్వహణ, అనుసంధాన కేంద్రాల పనితీరు సమీక్ష, కాంగ్రెస్ కనెక్ట్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్ వినియోగం వంటి అంశాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సమగ్ర నివేదికను అధిష్ఠానానికి సమర్పించారు.





## జూరాలకు తగ్గుతున్న వరద

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 27(ప్రభాత ఉదయం)**

మహారాష్ట్ర, కర్ణాటకలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రియదర్శిని జూరాల జలాశయానికి సోమవారం వరద తగుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. కర్ణాటకలోని నారాయణపూర్ డ్యాంకు ఎగువన ఉన్న ఆల్మట్టి డ్యాం నుంచి 20,500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి జూరాల ప్రాజెక్టుకు 27,000 క్యూసెక్కుల వదర నీటిని వదులుతున్నారు. సోమవారం ఉదయం నుంచి పెరుగుతున్న వరద సోమవారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు ఉండగా ప్రస్తుతం 318.010 మీటర్ల వద్ద నీరు నిల్వ ఉన్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలకు గాను ప్రస్తుతం 8.631 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

## హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి రంగనాథ్‌ను తప్పించండి

### హైకోర్టు కీలక ఆదేశం

### హైడ్రా కమిషనర్ రంగనాథ్ తొలగింపునకు ఆదేశాలు

### ఐజీ స్థాయి అధికారిని నియమించాలని సూచన





**హైదరాబాద్, జులై 27 (ప్రభాత ఉదయం)**

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన్ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని సీఎస్‌ను ఆదేశించింది. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులను ఆశ్రయించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని పేర్కొంది. ఉన్నతాధికారిగా ఉన్న రంగనాథ్.. కోర్టు ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని ఆక్షేపించింది. మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట భూములకు సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను హైడ్రా ఉల్లంఘించిందంటూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నా.. ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారని పేర్కొంది. ఒకే పిటిషన్‌కు సంబంధించి పలుమార్లు కోర్టు ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ ధిక్కరించడం నేరమని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కోర్టుకు ఆయన హాజరుకావాలని ఆదేశించింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ జోక్యం చేసుకుని దీనిపై పూర్తిస్థాయిలో అఫిడవిట్ దాఖలు చేస్తామని తెలిపారు. అఫిడవిట్‌లో రంగనాథ్ క్షమాపణ కోరారు. కోర్టుల పట్ల పూర్తిస్థాయి నమ్మకముందని పేర్కొన్నారు. లోతుకుంట సర్వే నంబర్ 1, 2లో ఉన్న ..మిగతా 2లో



## బంగాళాఖాతంలో తీవ్ర వాయు గుండం

నేడు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు 2



## పంజాబ్‌లో రైతుల ఆందోళనలు

### బిజెపికి పరీక్షా సమయం


2

## పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన కెసిఆర్

### ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మాజీ సిఎం

**హైదరాబాద్, జులై 27 (ప్రభాత ఉదయం)**

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించేందుకు ఎర్రవెల్లిలోని నివాసం నుండి బయలుదేరి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి చేరుకున్నారు. కేసీఆర్ యశోద ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెద్ది ..మిగతా 2లో





## ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు

### ఇది ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం ఇచ్చిన భరోసా

**న్యూఢిల్లీ, జులై 27 (ప్రభాత ఉదయం)**

నీట్ పేపర్ లీక కేసుకు సంబంధించి విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పిస్తుందని, కేవలం నిరసన వ్యక్తం చేస్తున్నారనే కారణంతో పోలీసు బల ప్రయోగానికి పాల్పడకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జూలై 20న 'సంసద్ చలో' కార్యక్రమంలో భాగంగా నీట్ పేపర్ లీక కేసుపై న్యాయం కోరుతూ విద్యార్థులు నిర్వహించిన నిరసన సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ..మిగతా 2లో

## ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లింపులో విఫలం



### విద్యారంగ సమస్యల పరిష్కారంలో అలసత్వం

### యువ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి విద్యాశాఖ అప్పగించాలి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు డిమాండ్

**హైదరాబాద్, జులై 27 (ప్రభాత ఉదయం)**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థి, యువత జీవితాలతో సీఎం రేవంత్ రెడ్డి చెలగాటమాడుతున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మండిపడ్డారు. మరోవైపు యువత ఎన్నికల్లో పోటీ చేసేలా వయసును 21 ఏళ్లకు తగ్గించాలని కొత్త డ్రామా షురూ చేశారని విమర్శించారు. ఈ క్రమంలో విద్యాశాఖ వైఫల్యాన్ని అంగీకరిస్తూ యవ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి విద్యాశాఖను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యాశాఖ, హోంశాఖ, న్యాయశాఖ తదతర శాఖలను సిఎం సమర్థంగా నిర్వహించలేకపోతున్నారని ఆయన మీడియా సమావేశంలో మండిపడ్డారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఖర్గేను తీసేసి యువనేతను ఎన్నుకోవచ్చు కదా.. అని ప్రశ్నించారు. భాజపా జాతీయ అధ్యక్షుడిగా యువ నాయకుడు నితిన్ నబీన్‌ను చేశామని గుర్తు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని డైవర్ట్ చేయడానికే.. 21 ఏళ్లకు పోటీ ..మిగతా 2లో

# బంగాళాఖాతంలో తీవ్ర వాయు గుండం



### నేడు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు

**హైదరాబాద్, జులై 27 (ప్రభాత ఉదయం)**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారనున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మంగళవారం పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఏపీ, తెలంగాణలోని పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌లు జారీ చేయగా.. గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదు-రుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.ఏపీ, తెలంగాణకు వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం.. తీవ్ర వాయుగుండంగా మారబోతోందని తెలిపింది. దీంతో.. ఏపీ, తెలంగాణలోని పలు జిల్లాల్లో ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌లు జారీ చేసింది. మంగళవారం ఆయా జిల్లాల్లో తెలికపాటి నుంచి మోస్తరు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతోపాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అల్లూరి సీతారామరాజు, పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి ఏలూరు జిల్లాలో అక్కడక్కడ ఉరుములతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. దీంతోపాటు 40నుంచి 60కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.అదేవిధంగా శ్రీకాకుళం, విజయనగరం, బాపట్ల, శ్రీ సత్యసాయి, తిరుపతి జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉరుములు, మెరుపులు ఉన్నప్పుడు చెట్లు, హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాల కింద నిలబడవద్దని హెచ్చరించింది .తెలంగాణ రాష్ట్రంలో కూడా.. చాలా చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. భారీవర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉ ందని.. గంటకు 30-40 కి.మీ వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.ముఖ్యంగా.. పెద్దపల్లి, కరీంనగర్, సిద్దిపేట, మెదక్, యాదాద్రి, మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, నల్గొండ, సూర్యాపేటలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. వీటితోపాటు అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# పంజాబ్‌లో రైతుల ఆందోళనలు




### ఎన్నికల ముందు బిజెపికి పరీక్షా సమయం

**చండీఘడ్ జులై 27 (ప్రభాత ఉదయం)**

పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఇటీవల ప్రధాన నరేంద్ర మోదీ ఆ రాష్ట్ర పర్యటనతో అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అంశాలను తెరపైకి తీసుకువచ్చి, నూతన రాజకీయ ఒరవడిని సృష్టించాలని భావించిన బీజేపీకి.. ప్రస్తుతం ఇలా రైతులు ఆందోళనకు దిగడం సవాల్‌గా మారింది. భారత్-అమెరికా ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా వేలాది మంది రైతులు మరోసారి శంభు సరిహద్దు వద్ద గుమిగూడారు. వారిని ఢిల్లీ వైపు వెళ్లనీయకుండా హరియాణా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడి పరిస్థితులు 2020-21 వ్యవసాయ చట్టాల ఉద్యమం, 2024 అన్నదాతల ఆందోళనలను గుర్తుచేస్తున్నాయి. ఇరుదేశాల మధ్య ఈ ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం అమల్లోకి వస్తే.. అమెరికా నుంచి భారీ సబ్సిడీలతో వచ్చే వ్యవసాయ, పాల ఉత్పత్తులు భారత మార్కెట్‌లోకి ప్రవేశించే అవకాశముందని రైతు సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. ఫలితంగా.. దేశంలో రైతు ఉత్పత్తులకు ధరలు తగ్గి ఆదాయం దెబ్బతింటుందని వారు వాపోతున్నారు. మరోవైపు.. ఒప్పందం పూర్తయ్యే వరకు వేచి చూడాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. ఆ తర్వాత రైతుల ప్రయోజనాలను కాపాడుకునే అవకాశం ఉ ండదని రైతు సంఘాలు వాదిస్తున్నాయి. ఈ అంశంపై పంజాబ్ బీజేపీ అధ్యక్షుడు కేవల్ సింగ్ ధిల్లాన్ స్పందిస్తూ.. ఇప్పటివరకు ఎలాంటి తుది ఒప్పందం కుదరలేదని, రైతులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. అన్నదాతలు, పశు పోషకుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని ప్రధాని మోదీ కూడా హామీ ఇచ్చారన్నారు. అయితే.. ఈ ప్రతిపాదిత ఒప్పందాన్ని కాంగ్రెస్ తీవ్రంగా తపబడుతోంది. ఈ డీల్ ద్వారా వ్యవసాయం, పాల పరిశ్రమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆరోపిస్తోంది. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఈ డీల్‌ను రైతులపై 'అతిపెద్ద ద్రోహం'గా అభివర్ణిస్తూ.. ముసాయిదా ఒప్పందాన్ని బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తోంది. అటు.. శిరోమణి అకాలీదళ్ కూడా ఈ ఉద్యమానికి మద్దతు తెలిపింది. పంజాబ్‌లో రైతులు మరోసారి ఇలా ఉద్యమ బాటపట్టడంతో ఎన్నికల వేళ అన్నదాతల సమస్యలే ప్రధాన చర్చాంశంగా మారే అవకాశం కనిపిస్తోంది. 2020లోనూ ఇదే తరహాలో సాగు చట్టాలను వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టిన రైతులు.. మరలా ఇపడు అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందానికి ప్రతికూలంగా ఆందోళనలకు దిగడం విశేషం. ఇదిలాగే తీవ్రరూపం దాల్చితే విదేశీ వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా దేశంలో జరిగే తొలి భారీ రైతు ఉద్యమం కానుంది.



### ప్రతి పౌరుడికి శాంతియుతంగా

# నిరసన తెలిపే హక్కు

మొదటి పేజీ తరువాయి...

ప్రయోగించారు. ఈ ఘటనపై స్వతంత్ర విచారణ జరపాలని కోరుతూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధ హక్కులపై కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పౌరులకు కల్పించిందని పేర్కొంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తం చేసే స్వేచ్ఛ ప్రతి పౌరుడికి ఉందని స్పష్టం చేసింది. అలాగే, కేవలం నిరసన జరుగుతోందనే కారణంతోనే లాఠీచార్జ్ లేదా బలప్రయోగాన్ని సమర్థించలేమని కోర్టు వ్యాఖ్యానించింది. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగంపై స్వతంత్ర విచారణ జరపాలని పిటిషనర్లు కోరారు. ఈ ఘటనలో పోలీసులు అనుసరించిన విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత నిరసనలు ప్రజల ప్రాథమిక హక్కుల్లో భాగమని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు ఒక ప్రజాస్వామ్య మార్గమని, అలాంటి సందర్భాల్లో చట్టాన్ని అమలు చేసే సంస్థలు కూడా రాజ్యాంగబద్ధ హక్కులను గౌరవిస్తూ వ్యవహరించాలని అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు నిరసన హక్కు, పోలీసుల చర్యల పరిమితులపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి.



# రూ.270 కోట్ల రోడ్డు విస్తరణ పనులు

**హైదరాబాద్, జులై 27 (ప్రభాత ఉదయం)**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రూ.270 కోట్ల వ్యయంతో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దశాబ్దకాలంగా అటవీ శాఖ అనుమతులు లభించక రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అవసరమైన అనుమతులు పొందేలా చర్యలు తీసుకుని, రూ.140 కోట్లతో గండిమైసమ్మ--మియాపూర్ రహదారి, రూ.130 కోట్లతో బహదూరపల్లి--దూలపల్లి రహదారి విస్తరణ పనులను ప్రారంభించినట్లు వెల్లడించారు. అనంతరం సంబంధిత అధికారులతో కలిసి రెండు రహదారి ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించి, పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, కూన శ్రీశైలం గౌడ్, జిల్లా కలెక్టర్ మను చౌదరి, సీఎంసీ కమిషనర్ శ్రీజన, దుండిగల్ డీసీ డాక్టర్ వెంకట మణి కరణ్, తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు హనుమంత్ రెడ్డి, భూపతి రెడ్డి, బొంగునూరి కిషోర్ రెడ్డి, బొంగునూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



# ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లింపులో విఫలం

మొదటి పేజీ తరువాయి...

అంశాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. యువతకు నిరుద్యోగ భృతి, స్కూటీ, రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడికి వెళ్లాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి... విద్యా శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి నిజాయితీ చాటుకున్నారని, తెలంగాణలో రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి చెల్లించకుండా తాత్సారం చేస్తున్న రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. విద్యార్థులు, యువత జీవితాలతో చెలగాటమాడు తున్న రేవంత్ రెడ్డి సర్కార్ క్యాండిల్ ర్యాలీలు చేయడం సిగ్గుచేటని, భవిష్యత్తులో అదే క్యాండిల్‌తో విద్యార్థులు, యువత వారిని తగలబెడతారన్నారు. ఢిల్లీలో జరిగిన విద్యార్థుల నిరసనల్లో విదేశీ హస్తం ఉందని ఆరోపించారు. యువత, కాంగ్రెస్ నిరసనలతో కేంద్రం దిగి వచ్చిందనే మాటలు అవాస్తమన్నారు. యువతకు 21 ఏళ్లకే ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలన్న రేవంత్ వ్యాఖ్యలను రాంచందర్‌రావు ఖండించారు. ఎన్నికల వయోపరిమితిపై నిర్ణయం తీసుకునే అధికారం సీఎంకు లేదని, ఈ అంశం కేంద్ర ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుందన్నారు. యువతను తపదోవ పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు.

### పెద్ది సుదర్శన్ రెడ్డిని

# పరామర్శించిన కెసిఆర్

మొదటి పేజీ తరువాయి...

కుటుంబ సభ్యులకు కేసీఆర్ మనోధైర్యాన్ని అందించారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు. రెండు రోజుల క్రితమే యశోద హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న పెద్దికి ఆదివారం హనుమకొండలోని ఇంట్లో ఉదయం 7 గంటలకు తీవ్రమైన గుండెపోటు రాగా ఆయన భార్య స్వప్న వెంటనే దగ్గరలోని రోహిణి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కార్డియాలజిస్ట్ మమతారెడ్డి నేతృత్వంలో వైద్యుల బృందం వేగంగా స్పందించి అత్యవసర వైద్యం అందించారు. అత్యవసర సీపీఆర్ అనంతరం మెరుగైన వైద్యం కోసం పెద్ది సుదర్శన్ రెడ్డిని గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించిన విషయం తెలిసిందే.

# హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

మొదటి పేజీ తరువాయి...

40 ఎకరాల భూమిలోకి వెళ్లలేదని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని, దీనికి కారణమేంటని ప్రభుత్వం తరపు న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ క్రమంలో రంగనాథ్‌ను తొలగించాలని పేర్కొంటూ.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని ఆదేశించింది. లోతుకుంట భూముల వ్యవహారానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాలంటూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ధర్మాసనం పేర్కొంది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. లోతుకుంట ప్రైవేటు భూములపై హైడ్రా జోక్యాన్ని తప్పుబట్టింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని.. రంగనాథ్‌ను తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణలు తెలిపారు. కోర్టులు, న్యాయ వ్యవస్థపై తనకు ఎంతో నమ్మకం ఉందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే లోతుకుంట సర్వే నంబర్లు 1, 2 పరిధిలోని 40 ఎకరాల భూమిలోకి హైడ్రా బృందం వెళ్లలేదని కోర్టుకు వివరించారు. ఈ విషయంలో పిటిషనర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని కూడా రంగనాథ్ తన అఫిడవిట్‌లో తెలిపారు.

# అయోధ్య విరాళాల చోరీ కేసు

### నివేదిక సమర్పించాలన్న సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ, హైదరాబాద్, జులై 27 (ప్రభాత ఉదయం)**

అయోధ్య రామమందిర విరాళాల చోరీ ఆరోపణల సంబంధిత కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. కేసు దర్యాప్తు పారదర్శకంగా, సమగ్రంగా చేపట్టేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)లో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను తప్పనిసరిగా చేర్చాలని ఉ త్తర్వులిచ్చింది. అలాగే దర్యాప్తు పురోగతిపై కూడా రెండు వారాల్లోగా స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని సిట్‌ను ఆదేశించింది. ఈ కేసు విచారణ కోసం ఐజీ కిరణ్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటుచేసినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. కేసు విచారణ వేగంగా, నిష్పాక్షికంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది ఆలయానికి వచ్చిన విరాళాల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచాలని కోరారు. అయితే.. ప్రస్తుతం తాము దర్యాప్తును పూర్తి చేయడంపైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నామని న్యాయస్థానం పేర్కొంది. ఈ నేపథ్యంలో సదరు వివరాలను వెలువరించడంపై ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదు. సిట్ సమర్పించే నివేదికను పరిశీలించాకే తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. దీంతో ఈ కేసు దర్యాప్తు మరింత వేగవంతం కానుంది.

# అభివృద్ధి పనుల్లో జాప్యానికి తావివ్వొద్దు

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

### ప్రజా సమస్యల పరిష్కారమే అధికారుల ప్రధాన లక్ష్యంగా ఉండాలి

### అధికారులతో సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్




**శంషాబాద్,జులై27(ప్రభాత ఉదయం)**

శంషాబాద్ మండల కేంద్రంలోని మండల కార్యాలయంలో ఆదివారం అభివృద్ధి పనులు,ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక ప్రగతి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో మండల వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సవివరంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మండలంలోని గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీరు,రోడ్లు, విద్యుత్, పారిశుద్ధ్యం, డ్రైనేజీ,విద్య,ఆరోగ్య రంగాలకు సంబంధించిన సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా పారదర్శకంగా, సమయ పాలనతో సేవలు అందించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తవుతాయని పేర్కొన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని,నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను సానుకూల దృక్పథంతో పరిశీలించి తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు,మండల పరిధిలోని గ్రామపంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అయిజ రైతు వేదికలో వైభవంగా 'కిసాన్ విత్తన మేళా'

## పంట వైవిధ్యీకరణపై విస్తృత అవగాహన




**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 27(ప్రభాత ఉదయం)**

అయిజ రైతు వేదిక వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం 'కిసాన్ విత్తన మేళా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా స్వల్పకాలిక వర్షాధార పంటలు, కూరగాయలు సాగు చేస్తూ లాభసాటి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని, పంట వైవిధ్యీకరణ పాటించాలని వ్యవసాయ అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, సహాయ వ్యవసాయ అధికారులు పాల్గొని మాట్లాడారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో, స్వల్పకాలంలో అధిక దిగుబడినిచ్చే విత్తనాలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. నకిలీ విత్తనాల బారిన పడకుండా, గుర్తింపు పొందిన విక్రేతల వద్ద మాత్రమే నాణ్యమైన, ధృవీకరించిన విత్తనాలను కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. విత్తన మేళాలో వివిధ రకాల పంటలు , కూరగాయల నాణ్యమైన విత్తన రకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విత్తన విక్రేతలు, వివిధ రకాల విత్తనాల యాజమాన్య పద్ధతులు, వాటి ప్రాముఖ్యతను రైతులకు వివరంగా వివరించారు. ఈ విత్తన మేళా అవగాహన సదస్సులో మండల వ్యవసాయ అధికారులు విస్తరణ అధికారులు, విత్తన విక్రేతలు, ప్రజాప్రతినిధులు మరియు పరిసర గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 55.56 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజ్


**బుద్వేల్, జూలై 27 (ప్రభాత ఉదయం)**


ఓటరు జాబితా నమోదు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమానికి ఇంకా వారం రోజులే మిగిలి ఉండగా, ఇప్పటి వరకు రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం లో 3,52,973 మంది ఓటర్లకు సంబందించిన ఎన్యుమరేషన్ ఫారాలను మాత్రమే అధికారులు ఆన్లైన్ చేయగలిగారు. నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 6,35,283 మంది ఉన్నారు. అంటే 55.56 శాతం ఓటర్లు మాత్రమే ఎన్యుమరేషన్ ఫారాలను తీసుకుని పూర్తి చేసి ఇవ్వగా వాటిని అధికారులు ఆన్ లైన్ చేశారు. ఇంకా 2, 82, 310 మంది ఓటర్లు తమ ఎన్యుమరేషన్ ఫారాలను బీఎల్ లకు ఇవ్వాల్సి ఉంది.

**వారం రోజులలో ఓటర్లందరి ఎన్యుమరేషన్ ఫారాలు రావడం కష్టమే :**

ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి తిరిగి బీఎల్ఓ లకు ఇచ్చే గడువు ఆగస్టు 3వ తేదీ తో ముగుస్తుంది. అంటే కేవలం ఆరు రోజుల గడువు మాత్రమే ఉంది. ఈ ఆరు రోజులలో మరో 47 వేల ఫారాలు వచ్చినా నాలుగు లక్షల ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలను ఇచ్చినవారవుతారు. అంటే నియోజకవర్గంలో 60శాతం ఓటర్లు తమ ఓటరు ఎన్యుమరేషన్ ఫారాలను బీఎల్ఓ లకు ఇచ్చి తమ ఓటు ను పదిలం చేసుకున్నట్లు అన్నమాట. ఇదే జరిగితే రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మరో 2,35, 283 మంది ఓటర్లు ఎక్కడికి వెళ్లినట్లో తెలియని పరిస్థితి నెలకొంటుంది.

# బైక్‌ను ఢీ కొట్టిన కారు.. యువకుడి మృతి







**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 27(ప్రభాత ఉదయం)**

బైక్ ను కారు ఢీ కొట్టడంతో యువకుడు మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గద్వాల పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాకు చెందిన సునీల్(24) అనే యువకుడు గద్వాలలోని శ్రీజోగులాంబ న్యూరో హాస్పిటల్ లో టెక్నిషియన్ గా పని చేస్తు జీవనం సాగిస్తున్నారు. ఆసుపత్రి డ్యూటి అనంతరం పార్ట్ టైమ్ జాబ్ గా ర్యాపిడో సంస్థలో ర్యాపిడో రైడర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఒక వ్యక్తి గద్వాలలో డ్రాపింగ్ కోసం ర్యాపిడో బుక్ చేసుకోవడంతో ఫికప్ కోసం గద్వాల రైల్వే స్టేషన్ వైపు తన బైక్ పై బయలుదేరాడు. ఈ క్రమంలో గద్వాల ఫ్లైఓవర్ మీదుగా రైల్వేస్టేషన్ వెళ్తున్న క్రమంలో సునీల్ నడుపుతున్న బైక్ ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. బైక్ పై ఉన్న సునీల్ కిందపడగా తీవ్రగాయాలవడంతో స్థానికులు సునీల్ ను గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు గద్వాల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఫ్లై ఓవర్ మీదుగా రైల్వే స్టేషన్ వెళ్తున్న బైక్ ను అయిజ నుండి గద్వాల్ వైపుకు వస్తున్న కారు బలంగా ఢీకొట్టడంతోనే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు స్థానికులు పేర్కొన్నారు.




# రోడ్డుపై సంపు నీటిని విడుదల చేసిన సంస్థకు రూ.15 వేల జరిమానా

### డీవాటరింగ్ సబ్‌మర్సిబుల్ పంపు స్వాధీనం

**హైదరాబాద్, జూలై 27(ప్రభాత ఉదయం)**

ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా రోడ్డుపై సంపు శుభ్రపరిచిన నీటిని విడుదల చేసి డ్రైనేజీ వ్యవస్థను చోకేజి చేసినందుకు జలమండలి అధికారులు బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని వెంకటేశ్వర కాలనీ వార్డు, జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలో ఉన్న క్యాన్.061263187కు చెందిన కె. స్వరూప్ కుమార్ రెడ్డి ఆధీనంలోని "ఐషా రావు బ్రైడల్ వేర్" సంస్థపై 15 వేల రూపాయల జరిమానా విధించారు. సంస్థ సంపు శుభ్రపరిపనులను ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా నిర్వహిస్తూ, వెలువడిన మురికి నీటిని నేరుగా రోడ్డుపైకి విడుదల చేయడంతో డ్రైనేజీ వ్యవస్థ ఒక రోజు పాటు చోకేజితో ప్రజలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. ఫిర్యాదు అందుకున్న జలమండలి అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సంపు శుభ్రపరిచే పనుల్లో ఉపయోగించిన డీవాటరింగ్ సబ్‌మర్సిబుల్ పంపు సెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు, సంబంధిత ఏజెన్సీకి భవిష్యత్తులో సంపు శుభ్రపరిచే సమయంలో మురికి నీటిని రోడ్లపైకి విడుదల చేయకుండా, జలమండలి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అవగాహన కల్పించారు. ఇటువంటి ఉల్లంఘనలు పునరావృతమైతే మరింత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా రోడ్లపై మురికి నీటిని విడుదల చేయడం, డ్రైనేజీ వ్యవస్థకు అంతరాయం కలిగించడం వంటి చర్యలను జలమండలి ఏమాత్రం ఉపేక్షించదని అధికారులు స్పష్టం చేశారు.




## మున్సిపల్ కార్మికులకు

# సెలవులు అమలు చేయాలి

### గ్రేటర్ స్పెషల్ కమిషనర్ ఆదేశాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్..

### ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి

**రాజేంద్రనగర్,జులై27(ప్రభాత ఉదయం)**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు స్పెషల్ కమిషనర్ జారీ చేసిన సెలవుల ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ వనంపల్లి జైపాల్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.మద్దిలేటి ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ...మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఎన్నో సంవత్సరాల పోరాట ఫలితంగా సాధించుకున్న హక్కులను అమలు చేయాలని కోరారు. గ్రేటర్ స్పెషల్ కమిషనర్ గత జూన్ 19 జారీ చేసిన సర్క్యులర్ నెం.1906/ఎల్‌డబ్ల్యూఎస్/బి1/జీహెచ్ఎంసీ/2026-256 ప్రకారం 15 క్యాజువల్ సెలవులు,8 పండుగ సెలవులు,మహిళా కార్మికులకు 120 రోజుల ప్రసూతి సెలవులను అమలు చేయాలని అన్ని జోనల్ కమిషనర్లు,డిప్యూటీ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. వినతిపత్రంపై స్పందించిన జోనల్ కమిషనర్ వికాస్ మహతో,స్పెషల్ కమిషనర్ ఆదేశాల మేరకు కార్మికులకు కల్పించాల్సిన సెలవులను తప్పకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ ఎల్‌బీనగర్ జోన్ అధ్యక్షుడు బి.రాములు, సుఖమ్మ,జ్యోతి,కొమురమ్మతోపాటు పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

# శంషాబాద్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ రెడ్డిని సన్మానించిన నాయకులు




**శంషాబాద్,జులై27(ప్రభాత ఉదయం)**

శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలకమర్రి మహేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శంషాబాద్ రూరల్ ఫ్యూచర్ సిటీ పోలీసు స్టేషన్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సురేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా,గంజాయి,హుక్కా కేంద్రాలు,సంఘవిద్రోహ శక్తులపై ఉక్కుపాదం మోపాలని కోరారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి,నేర నియంత్రణలో పోలీసులకు తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చంద్రారెడ్డి,మాజీ జెడ్పీటీసీ ఫ్లోర్ లీడర్ నీరటి తన్విరాజుముదిరాజ్,శంషాబాద్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు,పాలమాకుల సర్పంచ్ కోటేశ్వర్ గౌడ్, సర్పంచులు ప్రభాకర్ గౌడ్,బాలు ముదిరాజ్,రావి నాయక్,బిక్షపతి రెడ్డి,రవీందర్ నాయక్,లక్ష్మిలింగం, ఆంజనేయులు,బిక్యా నాయక్,గోపాల్ నాయక్,రాంగోపాల్,దేవేందర్ నాయక్,నర్సింహా,మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దండు ఇస్తారి,చిన్నగోల్కొండ సొసైటీ చైర్మన్ దౌణాకర్ గౌడ్,నర్సింగ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీకాంత్ గౌడ్,కచారం మాజీ సర్పంచ్ బిక్షపతి,రమేష్ యాదవ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంద్రారెడ్డి,దేవేందర్,పవన్,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోనుపాడులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో అవకతవకలు

## కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు




**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 27 (ప్రభాత ఉదయం)**


జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వానా భాషకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో గద్వాల మండలం గోనుపాడు గ్రామానికి చెందిన సుమారు 20 మంది బాధితులు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో తీవ్ర అక్రమాలు చోటుచేసుకున్నాయని, నిజంగా నివాసం లేని నిరుపేదలు, అర్హులైన కుటుంబాలను పక్కనపెట్టి ఇప్పటికే సొంత ఇళ్లు ఉన్నవారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. ఏళ్లుగా అద్దె ఇళ్లలో, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో జీవనం సాగిస్తున్న తమలాంటి పేద కుటుంబాలకు న్యాయం జరగలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో జరిగిన ఎంపిక ప్రక్రియపై జిల్లా స్థాయి అధికారులతో సమగ్ర విచారణ జరిపించి, అర్హతల జాబితాను బహిర్గతం చేసి, అనర్హుల కేటాయింపులను రద్దు చేసి నిజమైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ వినతిపత్రంపై వెంటనే విచారణకు ఆదేశాలు జారీ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు అర్హులైన పేద కుటుంబాలకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లమ్మ, శ్రీనివాసులు, బేబీ రాజు, నరసమ్మ, రమేష్, అరుణమ్మ, మల్లికార్జున్, చిట్టిబాబు, నరసింహులు, సులోచన, కృష్ణ, సత్తెమ్మ, రవి, సుందర్రాజు, వెంకట్ రాములు, బలరాముడు, సింగారం, నూర్ అహ్మద్, మహమ్మద్ హుస్సేన్, రాజు, సాకలి శారద, సాకలి జమ్మన్న, సాకలి పవిత్ర, బోయ లక్ష్మన్న, ఈదన్న, బోయ నరేష్, బిస్మిల్లా, అమీద్, కాజమ్మ, దౌలన్న తదితరులు పాల్గొన్నారు.

# జూరాల జలాశయానికి వరద.. విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం



**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 27 (ప్రభాత ఉదయం)**

నారాయణపూర్ డ్యాం నుంచి విడుదలైన వరద ప్రవాహంతో జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకుంది. దీంతో ఇరిగేషన్ అధికారుల ఆదేశాల మేరకు విద్యుదుత్పత్తిని ప్రారంభించారు.. జూరాల జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైంది. విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 14,000 క్యూసెక్కుల నీటిని శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. ఎగువ పరివాహక ప్రాంతమైన నారాయణపూర్ డ్యాం నుంచి 30,000 క్యూసెక్కుల వరద నీరు జూరాల జలాశయానికి వస్తోంది.



# పాలమూరు ఎంపీ డీకే అరుణపై అసత్య విమర్శలు చేస్తే సహించేది లేదు

**బీజేపీ గద్వాల జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 27(ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ నోటిని అదుపులో పెట్టుకోవాలని, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పాలమూరు ఎంపీ డీకే అరుణమ్మ పై చిల్లర విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని బీజేపీ గద్వాల జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు హెచ్చరించారు. సోమవారం గద్వాల పట్టణంలోని డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత గ్రామంలో సర్పంచ్‌ను కూడా గెలిపించుకోలేని డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి పాలమూరు ఎంపీ డీకే అరుణను విమర్శించడం హాస్యాస్పదమని రామాంజనేయులు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సొంత నాయకులే ఆయనను ప్రెసిడెంట్‌గా గుర్తించడం లేదని, కొత్త బిచ్చగాడు పొద్దు ఎరగనట్లు ప్రవర్తిస్తూ రాష్ట్ర నాయకులకు ఊడిగం చేసి అధ్యక్షుడు అయ్యాడని ఆయన మండిపడ్డారు. గద్వాలలో ఆయనను ఎవరూ గుర్తుపట్టే పరిస్థితి లేదని, కేవలం తన స్థాయిని పెంచుకోవడానికే పాలమూరు ఎంపీ పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గద్వాల పట్టణంలో నేడు కనిపిస్తున్న అభివృద్ధి అంతా గతంలో అప్పటి మంత్రి గా ఉన్న డీకే అరుణ హయాంలో జరిగిందేనని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జిల్లాలో అభివృద్ధి పూర్తిగా శూన్యమని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ అంటేనే కుంభకోణాల పార్టీ అని మండిపడుతూ...




గతంలో 2+ స్కామ్, బొగ్గు కుంభకోణం, ఏషియన్ కుంభకోణం, హవాలా కుంభకోణాలతో పాటు సంక్షేమ పథకాల పేరుతో దేశాన్ని దోచుకున్న చరిత్ర కాంగ్రెస్‌ది అని ధ్వజమెత్తారు. 70 ఏళ్ల పాలనలో ముస్లిం సంక్షేమం పేరుతో అనేక హామీలిచ్చి కాంగ్రెస్ మోసం చేసిందని, ముస్లిం సమాజాన్ని కేవలం ఎన్నికల సమయంలో ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుందని ఆరోపించారు. భారతీయ జనతా పార్టీ మాత్రం అన్ని మతాలకు అతీతంగా, “భారతదేశమే ఒక కుటుంబం” అనే భావనతో పనిచేస్తోందని స్పష్టం చేశారు. అలాగే, అయోధ్య శ్రీరామ జన్మభూమి మందిర నిర్మాణంలో కోట్లాది మంది భక్తులు స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చి భాగస్వాములయ్యారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ రావు, జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు మాలిమ్ ఇసాక్, మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, మల్లెందొడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు రెడ్డప్ప, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ నారాయణరెడ్డికి సమస్యలు వివరిస్తున్న ప్రజలు

# ఫిర్యాదు దారుల నుండి స్వీకరించిన సమస్యలను పరిష్కరిస్తాం:

**జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూలై 27(ప్రభాత ఉదయం)**

ప్రజావాణికి(136) ఫిర్యాదులు సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించినప్రజావాణి కార్యక్రమానికి (136) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసంనిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధితశాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలనుపెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలనిఅధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖ--54, ఇతర శాఖలు - 82 , మొత్తం 136 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి , కిరణ్మయిజిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్‌సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఎల్ నినో ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

**ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్**

**నంగునూర్, జులై 27(ప్రభాత ఉదయం)**

నంగునూరు రైతు వేదికలో ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ఏర్పాటు చేసిన విత్తనల మేళాను నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్,సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తగ్గే అవకాశం ఉందని అందువల్ల రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు అన్నారు. నాణ్యమైన విత్తనాలను మాత్రమే వినియోగించాలని శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తే దిగుబడులు మెరుగుపడతాయని అన్నారు. తక్కువ నీటితో, తక్కువ కాలంలో పండే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని కోరారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతుల్లో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నంగునూరు మండల రైతులు, విత్తన డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కనుల పండువగా గోరింటాకు వేడుకలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 27 (ప్రభాత ఉదయం)**

ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని గద్వాలలోని ప్రియదర్శిని ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో సోమవారం గోరింటాకు వేడుకలు సందడిగా నిర్వహించారు. ముందుగా మైదాకు చెట్టుకు మహిళలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సహజ సిద్ధమైన గోరింటాకులను అంతా కలిసి మెత్తగా నూరి గౌరీ దేవిని పూజించారు. అనంతరం మహిళలంతా కలిసి ఒకరినొకరు చేతులను గోరింటాకు మిశ్రమంతో అలంకరించుకొని మురిసిపోయారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. మీనాక్షి మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతీ,సంప్రదాయాలకు చిహ్నంగా గోరింటాకు పండుగను ప్రతీ ఏటా మహిళలు ఆషాఢ మాసంలో జరుపుకోవడం వెనుక శాస్త్రీయత ఉందన్నారు. గౌరీ దేవికి ప్రీతిపాత్రమైన గోరింటాకును మహిళలు ఈ నెలలో ఒక్కసారైనా పెట్టుకోవడం సనాతన ధర్మంలో భాగమన్నారు. గోరింటాకు భారతీయ సంస్కృతికి ప్రతీక అని, మహిళలు విద్య, ఉపాధి, నాయకత్వ రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డాక్టర్ ఎం. సమత మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థినుల్లో సాంస్కృతిక విలువలు, ఐక్యత, మహిళా సాధికారతపై అవగాహన పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, మహిళా సాధికారత విభాగం సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు..

# ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలి

**జిల్లా వ్యాప్తంగా 13 మండలాల రైతు వేదికల్లో ఘనంగా ప్రారంభమైన విత్తన మేళా కార్యక్రమాలు**

**ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విత్తనాలు,పథకాలతో లాభదాయక వ్యవసాయం సాధించాలి**

**వ్యవసాయంతో పాటు ఉద్యాన సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి:గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి**




**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 27 (ప్రభాత ఉదయం)**

వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు.సోమవారం ధరూరు రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం విత్తన ప్రదర్శన స్టాళ్లను సందర్శించి రైతులకు మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ,రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా జిల్లాలోని 13 మండలాల రైతు వేదికల్లో విత్తన మేళా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో రైతులు సంప్రదాయ సాగు విధానాలకు బదులుగా పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు.ప్రస్తుతం వర్షపాతం ఆశించిన స్థాయిలో లేకపోవడం,ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో సాగునీటి లభ్యత పరిమితంగా ఉండే అవకాశం ఉందన్నారు.అందువల్ల అధిక నీటి అవసరమున్న వరి సాగును వీలైనంత మేర తగ్గించి,తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు.వరికి బదులుగా కంది,పెసర,మినుము, శనగ,జొన్న,సజ్జ, మొక్కజొన్న,వేరుశెనగ,నువ్వులు,వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు.ఈ పంటల సాగు ద్వారా తక్కువ పెట్టుబడితో మెరుగైన దిగుబడులు, గిట్టుబాటు ధరలు లభించి రైతులు అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే రైతులు పండ్ల తోటలు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటల సాగుకు ప్రాధాన్యత ఇస్తే అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు.ప్రభుత్వం ఉద్యాన పంటలకు అందిస్తున్న సబ్సిడీలు, ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకుని సాగు విస్తీర్ణాన్ని పెంచి లాభదాయక వ్యవసాయం వైపు అడుగులు వేయాలని రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ శాస్త్రీయ సాగు విధానాలను అవలంబించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విత్తనాలు,సాంకేతిక సేవలు, పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు.ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టాలన్నారు. పశువులకు తాగునీరు, మేత కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. చెరువులు, కుంటలు, కాలువలను సంరక్షించి వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు.గ్రామాల్లో విస్తృతంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప మాట్లాడుతూ,వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు దీర్ఘకాలిక రకాల కంటే స్వల్పకాలిక, ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యవసాయ శాఖ సాంకేతిక సూచనలను పాటించాలని సూచించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రాజ్ కుమార్ మాట్లాడుతూ,పండ్ల తోటలు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటల సాగు ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని,ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గద్వాల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు,ధరూరు సర్పంచ్ డి.ఆర్ విజయ్,ఏడీఏ, ఎంఏఓలు,ఏఈఓలు,ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



# ప్రణాళిక ప్రకారమే ఉప్పల్ జంక్షన్ వద్ద పైప్‌లైన్ పనులు

**హైదరాబాద్, జూలై 27 (ప్రభాత ఉదయం)**

ఉప్పల్ జంక్షన్ వద్ద కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్టు ఫేజ్--2 రింగ్ మెయిన్--2కు చెందిన 1600 మి.మీ. వ్యాసం గల ఎంఎస్ గ్రావిటీ మెయిన్ పైప్‌లైన్ మరమ్మతుల పనులు ప్రణాళిక ప్రకారమే వేగవంతంగా కొనసాగుతున్నాయని జలమండలి తెలిపింది. నిర్ణీత సమయానికే పనులను పూర్తి చేసేందుకు జలమండలి అధికారులు, ఇంజినీర్లు, సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈరోజు రాత్రిలోగా ప్రధాన పనులను పూర్తి చేసి, అనంతరం పైప్‌లైన్ పునరుద్ధరణ, లైన్ ఫిల్లింగ్ ప్రక్రియను చేపట్టనున్నట్లు వెల్లడించింది.

**పనుల ప్రస్తుత స్థితి:**

1600 మి.మీ. పైప్‌లైన్ జంక్షన్ పనులు: పైప్‌లైన్‌కు ఇరువైపులా జంక్షన్ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులు ఈరోజు అర్ధరాత్రిలోపు పూర్తికానున్నాయి. అనంతరం పైప్‌లైన్ పునరుద్ధరణ, లైన్ ఫిల్లింగ్ పనులు చేపడతారు.

ఎయిర్ వాల్వుల ఏర్పాటు: ఏర్పాటు చేయాల్సిన 300 మి.మీ. వ్యాసం గల 7 స్లూయిస్ వాల్వుల్లో ఇప్పటికే 6 వాల్వులు అమర్చగా, మిగిలిన ఒక వాల్వు అమరిక పనులు కొనసాగుతున్నాయి.

దెబ్బతిన్న ఎయిర్ వాల్వు ఎక్స్‌టెన్షన్ పైపు మార్పిడి: ఉప్పల్ స్టేడియం సమీపంలోని 1600 మి.మీ. పైప్‌లైన్‌పై దెబ్బతిన్న 300 మి.మీ. వ్యాసం గల ఎయిర్ వాల్వు ఎక్స్‌టెన్షన్ పైపు మార్పిడి పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులు కూడా ఈరోజు అర్ధరాత్రిలోపు పూర్తికానున్నాయి.

పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి పనులను వీలైనంత త్వరగా పూర్తిచేసి, ప్రభావిత ప్రాంతాలకు మంచినీటి సరఫరాను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

ప్రస్తుతం చేపట్టిన అన్ని పనులు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతున్నాయని, రేపు ఉదయానికి పనులను పూర్తిచేసి.. ప్రభావిత ప్రాంతాలకు దశలవారీగా మంచినీటి సరఫరాను పునరుద్ధరిస్తామని జలమండలి తెలిపింది.



# మహేశ్వరం పారిశ్రామిక పార్క్‌ను సందర్శించిన సిఎస్

## అక్కడ పరిశ్రమల ఉత్పత్తులను పరిశీలించిన అధికారులు



**హైదరాబాద్,జూలై27 (ప్రభాత ఉదయం)**

ఈ-సిటీ మహేశ్వరం పారిశ్రామిక పార్కులలో పలు పరిశ్రమలను సి.ఎస్ సంజయ జాజు సందర్శించారు. సి.ఎస్ తో పాటు టి.జి.ఐ.ఐ.సి. స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శశాంకతో పాటు సీనియర్ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. ముందుగా,మెసర్స్ ప్రీమియర్ ఎనర్జీస్ ఫోటోవోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. ఈ-సిటీలో 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన ఈ సంస్థ సోలార్ పీవీ మాడ్యూల్స్ తయారీచేస్తోంది. రూ.1,240 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమలో ప్రస్తుతం 1,200 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అనంతరం అవాంటెల్ లిమిటెడ్ పరిశ్రమను సీ.ఎస్ సందర్శించారు. ఈ సంస్థ 4 ఎకరాల విస్తీర్ణంలో ఈ-సిటీలో ఉన్న ఈ పరిశ్రమ హైటెక్ రక్షణ ఎలక్ట్రానిక్స్, శాటిలైట్ పేలోడ్ వ్యవస్థలు, గ్రౌండ్ స్టేషన్ మౌలిక సదు-పాయాల అభివృద్ధిపై ప్రధానంగా చేపడుతోంది. రూ.59.22 కోట్ల పెట్టుబడితో ఉన్న ఈ సంస్థలో 400 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ సందర్బంగా మంఖాల్ పారిశ్రామిక పార్క్ ను సందర్శించి, మెసర్స్ చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ పరిశ్రమను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సందర్శించారు.ఇందులో కోటింగ్, మెటలైజింగ్, స్లిట్టింగ్ మరియు రీసైక్లింగ్ ఉత్పత్తులు జరుగుతాయి. కాగా, తమకు . కేటాయించిన స్థలంలో ఈ చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ సంస్థ తన తయారీ యూనిట్‌ను విజయవంతంగా నెలకొల్పి, ప్రాజెక్టుతో పాటు విస్తరణ ప్రాజెక్టును కూడా పూర్తి చేసింది. ప్రస్తుతం ఈ యూనిట్ వాణిజ్య ఉత్పత్తి నిర్వహిస్తూ రూ.284.02 కోట్ల పెట్టుబడితో 500 మందికి ఉపాధి కల్పిస్తోంది. అనంతరం, మహేశ్వరం జనరల్ పార్క్ లోని మెసర్స్ విప్రో ఎంటర్‌ప్రైజెస్ (ప్రైవేట్) లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. చివరిగా మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ మ్యాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ను సంజయ్ జాజు సందర్శించారు. అత్యాధునిక రత్నాలు, ఆభరణాల తయారీ యూనిట్ స్థాపన కోసం కేటాయించారు. ఈ సంస్థకు కేటాయించిన స్థలంలో తయారీ యూనిట్‌ను విజయవంతంగా ఏర్పాటు చేసి విస్తరణ ప్రాజెక్టులను పూర్తి చేసింది. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల కల్పనలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అభినందిస్తూ, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి మరింత వేగం తీసుకురావాలని సీ.ఎస్ సంజయ్ జాజు అధికారులను కోరారు.

రోడ్డు ప్రమాదంలో మరణించిన బీరెన్ రాయ్... ప్రమాదానికి కారణమైన కారు

**మద్యం మత్తులో కారు నడిపి ఓ వలస కార్మికుని మరణానికి కారణమైన**

# యువకుని అరెస్ట్

**బుద్వేల్, జూలై 27 (ప్రభాత ఉదయం)**

రోడ్డు ప్రమాదంలో ఓ వలస కార్మికుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి 1 గంటలకు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెటర్నరీ విశ్వవిద్యాలయం కు వెళ్లకముందు ఉన్నటువంటి యూ టర్న్ దగ్గర జరిగింది. రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి 15 రోజుల క్రితమే వచ్చిమ బెంగాల్ నుంచి పని కోసం వచ్చి రాజేంద్రనగర్ మానస హిల్స్ లో పనిచేస్తున్నట్లు తెలిసింది. వివరాలను రాజేంద్రనగర్ ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి వెల్లడించారు. ఆదివారం రాత్రి రాజేంద్రనగర్ మానస హిల్స్ నుంచి టీఎస్ 09 ఎఫ్బీ 4554 నెంబర్ స్కోడా రాపిడ్ కారును మద్యం మత్తులో మానస హిల్స్ కు చెందిన సాయి నితిన్ నడుపుతున్నాడు. కారును వేగంగా నడుపుతు వెటర్నరీ యూనివర్శిటీ యూ టర్న్ దగ్గర రోడ్డు దాటుతున్న బీరెన్ రాయ్ (48) ఢీ కొట్టడంతో ఆయన అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. గుర్తించిన స్థానికులు కారు ను, సాయి నితిన్ ను పట్టుకుని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. మృతి చెందిన బీరెన్ రాయ్ కూడా మాసన హిల్స్ లో ఉంటు పనులు చేసుకుంటున్నాడని పోలీసులు తెలిపారు. 15 రోజుల క్రితమే ఆయన పచ్చిమ బెంగాల్ నుంచి వలస కార్మికునిగా వచ్చారని తెలిపారు. తోటి కార్మికుడు ఆసిఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ ఎస్ఐ ప్రశాంత్రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎల్‌నినోను దృష్టిలో పెట్టుకుని సాగు చేయాలి

**రైతు వేదికల్లో అందుబాటులో నాణ్యమైన విత్తనాలు**

**రైతులకు సూచించిన వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి**

**హైదరాబాద్,జూలై27 (ప్రభాత ఉదయం)**

ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షపాతం అనిశ్చితంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ సూచించారు. ముఖ్యంగా పాడి రైతులు పశుగ్రాస అవసరాల కోసం మేత జొన్న సాగు చేపట్టాలని తెలిపారు. అలాగే నగరానికి సమీప ప్రాంతాల్లోని రైతులు కూరగాయల సాగు చేపట్టడం ద్వారా మెరుగైన ఆదాయం పొందవచ్చని సూచించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని ఫరూఖ్‌నగర్ మండలం వెల్జర్ల గ్రామ రైతు వేదికలో నిర్వహిస్తున్న విత్తన మేళాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వారి వ్యవసాయ పరిస్థితులు, పంటల సాగు, వర్షాభావ పరిస్థితులపై ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రైతు వేదికల్లో కందులు, పెసలు, మినుములు, కూరగాయల విత్తనాలు, మేత జొన్న విత్తనాలు తదితర నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచిందని తెలిపారు. ఈ విత్తన మేళ 29 వరకు రైతులకు అందుబాటులో ఉంటుంది రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ప్రాంత పరిస్థితులకు అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అనంతరం వెల్జర్ల గ్రామంలోని వ్యవసాయ పొలాలను సందర్శించిన వ్యవసాయ శాఖ కార్యదర్శి, రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి సాగు పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి చేపట్టి లాభదాయక వ్యవసాయం వైపు అడుగులు వేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, స్థానిక అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608